

ఆంధ్రజ్యోతి



పెద్దపల్లి

5★

జిల్లా వార్తలు

బుధవారం 24 సెప్టెంబరు 2025




దీపావళి పండుగ బహుమతులు ఇవ్వొద్దు

● ప్రభుత్వరంగ సంస్థలకు ఆర్థిక సలహాదారుడి లేఖ

కోల్‌సిటీ, సెప్టెంబరు 23(ఆన్‌లైన్): దీపావళితో పాటు ఇతర పండుగలకు అధికారులు, ఉద్యోగులకు బహుమతులు ఇచ్చి నిధులు దుర్వినియోగం చేయవద్దని కేంద్ర ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు కేంద్ర ఆర్థికశాఖ సలహాదారుడు, ప్రభుత్వరంగ సంస్థల ఆర్థిక సలహాదారుడు అయిన డాక్టర్ సుమంత్రపాల్ ప్రభుత్వరంగ సంస్థల అధికారులకు లేఖలు రాశారు.

ఈ నెల 17న ఈ మేరకు కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల చీఫ్ ఎగ్జిక్యూటివ్‌లకు సమాచారం ఇచ్చారు. పండుగల బహుమతుల పేర ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేయడం సరి కాదని, ఈ విధానాన్ని మానుకోవాలని పేర్కొన్నారు. దీని ప్రభావంతో ఆర్‌ఎఫ్‌సీ ఎల్‌తో పాటు ఇతర ప్రభుత్వ రంగ సంస్థల్లో దీపావళి బహుమతుల పంపిణీ ప్రక్రియ నిలిచిపోనున్నది. ఆర్‌ఎఫ్‌సీఎల్ ప్రతి ఏడాది సంస్థ అధికారులు, ఉద్యో గులతో పాటు ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు, పాత్రికేయులకు దీపా వళికి స్వీట్లను బహుమతిగా ఇచ్చేది. కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన సూచన ల మేరకు ఈ ప్రక్రియ నిలిచిపోనున్నది. ఎన్‌టీపీసీతో పాటు ఇతర ప్రభుత్వ రంగ సంస్థలపై కూడా దీని ప్రభావం పడనున్నది.



పూర్తయిన రిజర్వేషన్ల ప్రక్రియ

- జడ్పీటీసీ స్థానాలు ఎస్సీలకు 3, బీసీలకు 6, జనరల్‌కు 4
- ఎంపీపీ స్థానాలు ఎస్సీలకు 4, బీసీలకు 5, జనరల్‌కు 4
- ఎంపీటీసీ స్థానాలు ఎస్సీలకు 26, ఎస్టీలకు 3, బీసీలకు 58, జనరల్‌కు 50 స్థానాలు
- సర్పంచ్ స్థానాలు ఎస్సీలకు 50, ఎస్టీలకు 5, బీసీలకు 110, జనరల్‌కు 98
- ఈ లెక్కలు అటు, ఇటుగా మారే అవకాశం

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఆయా స్థానాల రిజర్వేషన్ల ప్రక్రియ పూర్తయ్యింది. రెండు రోజులుగా ప్రభుత్వ సూచనల మేరకు జిల్లా అధికార యంత్రాంగం రిజర్వేషన్లు ఖరారు చేశారు. జాబితాను బుధవారం ప్రభుత్వానికి పంపించనున్నట్లు సమాచారం. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీల జనాభాను తీసుకోగా, బీసీల కోసం 2014లో చేపట్టిన కులగణన లెక్కల ప్రకారం రిజర్వేషన్లు ఖరారు చేశారు. రెండు రోజుల నుంచి కలెక్టర్ సమక్షంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, పెద్దపల్లి, మంథని ఆర్‌డీవోలు, జడ్పీ సీఈవో, డీపీవో, ఎంపీవోలు, ఇతర సిబ్బంది కలెక్టర్ కార్యాలయంలోనే రిజర్వేషన్ల ప్రక్రియను చేపట్టారు. 2019లో జరిగిన గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో రిజర్వు అయిన కేటగిరీలు రొటేషన్ ప్రకారం మారనున్నాయి. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ మున్సిపాలిటీలు మినహా గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం జనాభా 4,91,651 మంది ఉన్నారు. ఇందులో ఎస్సీ జనాభా 94,104 మంది, ఎస్టీ జనాభా 10,115 మంది ఉన్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు ఆయా మండలాల జనాభా ఆధారంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు పోనూ మిగతా స్థానాలను జనరల్‌గా చూపెట్టనున్నారు. వార్డు సభ్యుల స్థానాలను గ్రామ జనాభా ఆధారంగా రిజర్వు చేశారు. ఇందులో 50శాతం సీట్లు మహిళలకు డ్రా తీసి కేటాయించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీలకు ఆయా స్థానాల్లో 19.14 శాతం, ఎస్టీలకు 2.05 శాతం, బీసీలకు 42 శాతం, జనరల్‌కు 36.80 శాతం సీట్లు కేటాయించారు.

● బీసీలకు జడ్పీటీసీ 6, ఎంపీపీ 5 స్థానాలు..

జిల్లాలో జిల్లా, మండల పరిషత్ స్థానాలు 13 ఉన్నాయి. గత రిజర్వేషన్ల అంచనాల ప్రకారం జడ్పీటీసీ స్థానాల్లో 3 ఎస్సీలకు, 6 బీసీలకు, 4 జనరల్‌కు, ఇందులో 6 స్థానాలు మహిళలకు కేటాయించారని సమాచారం. ఇందులో పాలకుర్తి, జూలపల్లి, ధర్మారం మండలాలు ఎస్సీలకు కేటాయించారని తెలుస్తున్నది. బీసీలకు

(మిగతా 8వ పేజీలో)

గాయత్రి దేవీ రూపంలో దుర్గామాత



కాపులపల్లిలో గాయత్రి దేవి అలంకరణలో అమ్మవారు

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభం కాగా రెండో రోజు మంగళవారం గాయత్రీదేవి రూపంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, యువకులు భక్తి శ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన మండపాలు అత్యంత వైభవంగా అలంకరణ చేయడంతో పలువురిని ఆకట్టుకుంటున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారి వద్ద కుంకుమార్చనలు, పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందించారు.

అక్రమంగా నిర్మిస్తున్న భవనం కూల్చివేత



సెట్ బ్యాక్ లేని భవనాన్ని కూల్చివేస్తున్న అధికారులు

మంథని, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డుకు సమీపంలో అక్రమంగా నిర్మించిన భవనాన్ని కోర్టు ఆదేశాల మేరకు పోలీసు బందోబస్తు మధ్య మున్సిపల్ అధికారులు మంగళవారం కూల్చి వేశారు. మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారిని ఆనుకొని ఉన్న భవన యాజమాని ఎలాంటి సెట్ బ్యాక్ లేకుండా బిల్డింగ్ నిర్మించారు. దీనిపై కొందరు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో వారు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారి మార్కింగ్ చేసిన మేరకు రెండు అంతస్తుల భవనాన్ని మున్సిపల్ సిబ్బంది ఎక్స్‌కావేటర్‌తో కూల్చివేశారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మున్సిపల్ పరిధిలో ఉన్న మరి కొన్ని సెట్‌బ్యాక్ లేని నిర్మాణాల పై సైతం కోర్టు ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ అధికారులు తెలిపారు.

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు



జూలపల్లిలో యూరియా కోసం లారీని అడ్డుకున్న రైతులు

జూలపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనరావుపేట గ్రామానికి చెందిన రైతులు యూరియా కోసం మండల కేంద్రంలో రోడ్డెక్కారు. మండల కేంద్రంలోని సహకార సంఘానికి తరలిస్తున్న యూరియా లారీని అడ్డుకున్నారు. గ్రామ రైతులకు సరిపడ యూరియా అందించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతు కూసుకుంట్ల రవిందర్‌రెడ్డి ఆరోపించారు. యూరియా లారీని గ్రామానికి తరలించి యూరియా అందించాలని డిమాండ్ చేశారు. మండల వ్యవసాయ అధికారి సెల్ ఫోన్‌లో రైతులతో మాట్లాడుతూ యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూ రియాను వాడాలని సూచించారు. నానో యూరియా పని తీరుపై మండలంలో ఎంత మంది రైతులకు అవగాహన కల్పించారు. నానోయూరియా వాడాలని చెబుతూ యూరియా బస్తాలను ఎందుకు పంపిణీ చేస్తున్నారని రైతు రవీందర్‌రెడ్డి ఏవోను ప్రశ్నించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా రైతులు వినకుండా లారీ ఎదుట బైఠాయించారు. యూరియా లారీని తమ గ్రామానికి తరలిస్తేనే ఆందోళన విరమిస్తామని తెలుపడంతో చేసేది ఏమిలేక అధికారులు కోనరావుపేట గ్రామా నికి యూరియా లారీని తరలించి 350 యూరియా బస్తాలను రైతులకు అందజేశారు.

పలు గ్రామాల్లో యూరియా పంపిణీ

ఎలిగేడు: మండలంలోని దూళికట్ట, ఎలిగేడు పీఏసీఎస్‌ల పరిధిలో 1015 బస్తాల యూరియా పంపిణీ చేసినట్లు మంగళవారం మండల వ్యవసాయ అధికారి ఉమాపతి తెలిపారు. ధూళికట్టలో 450, సుల్తాన్‌పూర్‌లో 340, బుర్హాన్‌మియాపేటలో 225 బస్తాలను రైతుల అవసరాల మేరకు పోలీసుల బందోబస్తు మధ్య అందజేశారు. అలాగే రైతులు పంటలకు పలు రకాలుగా మేలు చేసే నానో యూరియా ప్లస్‌ని కూడా యూరియాకు బదులుగా వాడుకోవాలని తెలిపారు. అత్యుత్తమ ఫలితాలతోపాటు దిగుబడి వస్తుందని వివరించారు. సొసైటీ చైర్మన్‌లు గోపు విజయభాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్ రావు, సీఈఓలు గడ్డం రవీందర్ రెడ్డి, విక్రమ్, ఏఈఓలు సురేష్, గణేష్, శరణ్య, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ

విద్యుత్ అధికారుల పొలంబాట



రైతులకు వివరిస్తున్న విద్యుత్ అధికారులు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రైతుల పొలాల వద్ద విద్యుత్ అధికారులు మంగళ వారం పొలంబాట నిర్వహించారు. ముందుగా రైతుల ను విద్యుత్ సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం విద్యుత్ వాడే విధానం, షాక్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తదితర అంశాలను రైతులకు వివరించారు. లైన్‌మెన్‌లు లేకుండా పొలాల వద్ద, ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు రైతులు వెళ్ల కూడదని పేర్కొన్నారు. ఆయా ట్రాన్స్‌ఫార్మర్లపై విద్యుత్‌కు సంబంధించిన టోల్ ఫ్రీ నెంబర్ ఉంటుందని, దాని ద్వారా సమస్యలు తెలపా లని సూచించారు. విద్యుత్ శాఖ టెక్నికల్ డీఈ బాల య్య, ఆపరేషన్ డీఈ మధుకర్, ఏడీఈ తిరుపతి, ఏఈ శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఓదెలలో క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

డ్రగ్స్ వద్దు... జీవితాలు ముద్దు



గౌరెడ్డిపేటలో ర్యాలీలో పాల్గొన్న ఎస్‌యూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ కు అలవాటు పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని గౌరెడ్డిపేట, హన్మంతునిపేట గ్రామాల్లో ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు మంగళవారం ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. గౌరెడ్డిపేటలో పెద్దపల్లి బాలికల జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో చేపట్టిన ఎన్‌ఎస్‌ఎస్ శిబిరానికి ముఖ్య అతిథిగా శాతవాహన యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ మనోహర్ హాజరై మాదక ద్రవ్యాల వల్ల జరిగే నష్టాలపై వివరించారు. ప్రోగ్రాం అధికారి నరహరి, కార్యదర్శి తిరుపతి, అధ్యాపకులు అశోక్, రామకృష్ణ, దీప, నవ్య పాల్గొన్నారు. హన్మంతునిపేటలో బాలుర జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. కో ఆర్డినేటర్ సదయ్య, వలంటీర్లు పాల్గొన్నారు.

యువత పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి



మాట్లాడుతున్న వడ్డేపల్లి రాంచందర్

జ్యోతినగర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం కల్పిస్తున్న బ్యాంకు రుణాలను పొంది చిన్న తరహా పరిశ్రమలు, పలు వ్యాపారాలు ఏర్పాటు చేసుకొని పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్ అన్నారు. మంగళవారం ఎన్‌టీపీసీ పర్మనెంట్ టౌన్‌షిప్ కాకతీయ ఫంక్షన్ హాల్‌లో నిరుద్యోగ యువతీయువకుల కోసం ఎంఎస్ఎంఇ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాట్లాడారు. యూనియన్ బ్యాంక్ డిజీఎం అపర్ణరెడ్డి, జిల్లా పరిశ్రమ అధికారితోపాటు ఎంఎస్ఎంఈ డైరెక్టర్ తాజ్ పాల్గొన్నారు.

లాభాల వాటాలో కార్మికులకు అన్యాయం

● నల్ల బ్యాడ్జిలతో టీబీజీకేఎస్ నిరసన



కార్మికులతో మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి లాభాల వాటాలో కార్మికులకు అన్యాయం జరిగిందని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి అన్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించిన వాస్తవ లాభాలు రూ.6394లుగా చూపి రూ.2360 కోట్లలో 34శాతం ప్రకటించడం అన్యాయమన్నారు. లాభాల వాటాలో అన్యాయం జరిగిందని మంగళవారం జీడీకే2 ఇంక్లైన్‌లో కార్మికులతో కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ రూ.5లక్షల లాభాల వాటా రావాల్సిన కార్మికునికి రూ.1.95 లక్షలకే పరిమితం చేయడం సింగరేణి కార్మిక వర్గం శ్రమను దోచుకోవడమేనని, గత సంవత్సరం సింగరేణి అభివృద్ధికి పక్కన పెట్టిన రూ.2289 కోట్లు ఏమయ్యాయో తెలుపాలన్నారు. ఈ సంవత్సరం వాస్తవ లాభాలలో 12.5 మాత్రమే లాభాల వాటా కార్మిక వర్గానికి చెందిందన్నారు. ఇటువంటి ప్రక్రియ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే మొదలైందని, దీనిపై పోరాడాల్సిన గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు స్పందించక పోవడం శోచనీయమన్నారు. కార్మిక వర్గానికి జరుగుతున్న నష్టంపై సంఘాలు కలిసికట్టుగా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి పేరిట సింగరేణి సంస్థకు చెందిన రూ.6వేల కోట్లపై చిలుకు నిధులను పక్కన పెట్టారని, ఇప్పటి వరకు వీటిని ఏ రకంగా ఉపయోగిస్తున్నారో తెలియదన్నారు. గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు కూడా నోరు మెదపకపోవడం. ప్రభుత్వానికి సహకరిస్తూ కార్మికులను లూటీ చేస్తున్నారని పేర్కొన్నారు. టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి శంకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కోశాధికారి చెల్పూరి సతీష్, దూట శేషగిరి, ఉప్పులేటి తిరుపతి, మీస రాజు, భాస్కర్ దేవేందర్, నరేష్ పటేల్, మధు సుకుమార్, ప్రసాద్ దేవేందర్, ప్రసాద్, వేణు, టిప్పు సుల్తాన్, రమేష్ పాల్గొన్నారు.


లాభాల వాటాపై రాజకీయాలు సరికాదు..

● ముఖ్యమంత్రిపై ఎమ్మెల్సీ కవిత ఆరోపణ

గోదావరిఖని, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు ప్రభుత్వం ప్రకటించిన లాభాల వాటాలో అన్యాయం జరిగిందని సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్‌లో జరుగనున్న బతుకమ్మ కార్యక్రమానికి వెళుతున్న కవిత మంగళవారం మున్సిపల్ టీ జంక్షన్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన లాభాల వాటాపై రాజకీయ రంగు పులమడం సరైంది కాదని, రెండు సంవత్సరాలుగా సింగరేణికి వస్తున్న లాభాల్లో తప్పుడు లెక్కలు చూపిస్తూ కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తున్నారని ఆరోపించారు. గని కార్మికులు చిందిస్తున్న చెమట చుక్కలతోనే తెలంగాణలో ప్రతి ఇంట లైటు, ఫ్యాను, ఏసీలు తిరుగుతున్నాయని, ప్రభుత్వం మానవీయ కోణాన్ని పక్కకు పెట్టి శ్రమ దోపిడీకి పాల్పడుతుందని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలు చీత్కరించే రోజులు దగ్గర పడ్డాయని, లోకల్‌లో చేయాల్సిన అపాయిమెంట్లు జీఎం స్థాయిలో చేయడమేమిటని మండిపడ్డారు. లాభాల వాటా కార్మికుల హక్కు అని, దీనిపై ముఖ్యమంత్రి పునః సమీక్షించుకోవాలని కోరారు. అధ్యక్షుడు రియాజ్ అహ్మద్, నాయకులు లావుడ్య వెంకటేష్, నిట్టూరి రాజు, దావు రమేష్ పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న కవిత



సారథి పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలి

● ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్



సారథి పోర్టల్ ద్వారా లెర్నింగ్ లైసెన్సును అందజేస్తున్న ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్, ఎంవీఐ రవికుమార్

తిమ్మాపూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన సారథి పోర్టల్ సేవలను జిల్లా ప్రజలు వినియోగించుకోవాలని ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆర్టీఏ కార్యాలయంలో సారథిపోర్టల్ ద్వారా మొట్టమొదటి సారి పొందిన లెర్నింగ్ లైసెన్స్‌ను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లెర్నింగ్, పర్మినెంట్, ఇతర లైసెన్సులకు సంబంధించి సారథి పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. లైసెన్సుదారుడు ఇతర రాష్ట్రాల్లో నివాసం ఉండి, ఉద్యోగరిత్యా ఇతర కారణాల దృష్ట్యా తెలంగాణ రాష్టానికి వచ్చినప్పుడు ఆ వ్యక్తి డైరెక్ట్‌గా సారథి పోర్టల్ ద్వారా చిరునామా మార్పు గురించి ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకొని సేవలను పొందవచ్చని తెలిపారు. సారథి పోర్టల్‌తో ఎటువంటి ఎన్‌వోసీ తీసుకురావాల్సిన అవసరం లేకుండానే సేవలను వినియోగించు కోవచ్చు అని తెలిపారు. తిమ్మాపూర్‌లోని జిల్లా ఆర్టీఏ కార్యాలయంలో సారథిపోర్టల్‌సేవలు ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో ఎంవీఐ రవికుమార్, ఆర్టీఏ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్లను అందజేసిన ఎస్సై

రామడుగు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలంలో ఇద్దరు యువకులు పోగొట్టుకున్న ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి వాటిని కనుక్కొని తిరిగి బాధితులకు అందజేశారు. రామడుగు ఎస్ఐ కె రాజు కథనం ప్రకారం.. రామడుగు గ్రామానికి చెందిన రాగం సాయి(22) అనేరైతు తన మొబైల్ ఫోన్‌ను ఇటీవల రామడుగులో పోగొట్టుకున్నాడు. అలాగే రామడుగు గ్రామానికి చెందిన ఎలగందుల రామకృష్ణ వెదిర నుంచి రామడుగు వచ్చేటప్పుడు తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. వీరిద్దరూ రామడుగు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, ఎస్ఐ రాజు సీఇఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్లను ట్రేస్‌చేసి కనుక్కొనికి వారికి అందజేశారు.

గంజాయి దహనం

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పలు పోలీసు స్టేషన్లలో నమోదైన 45కేసుల్లో నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న 14.945కిలోల గంజాయిని ఎన్డీపీఎస్ చట్టప్రకారం జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి గీతే మాట్లాడుతూ ఎన్డీపీఎస్ యాక్ట్‌లోని నిబంధనల ప్రకారం జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో నమోదైన గంజాయిని దహనం చేశామన్నారు. జిల్లాలో గంజాయి రవాణాను పోలీసులు సమర్థవంతంగా నిరోధిస్తున్నారన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలను రవాణా చేసినా, అమ్మినా, సేవించినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, డీసీఆర్బి సీఐ నాగేశ్వర్‌రావు, ఆర్ఎస్ఐ రాజు సిబ్బంది పాల్గొన్నారు.

జనరేటర్ దగ్ధం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారులోని కేబుల్‌బ్రిడ్జి బటర్‌ఫ్లై చౌరస్తాలో మంగళవారం అగ్నిప్రమాదంలో జనరేటర్ దగ్ధమైంది. మరమ్మతు కోసం శంకరపట్నం నుంచి కరీంనగర్‌కు డీజిల్ జనరేటర్‌ను ఆటోలో తీసుకొస్తున్నారు. బటర్‌ఫ్లై చౌరస్తా వద్దకు రాగానే జనరేటర్‌లో మంటలు లేచి అంటుకున్నాయి. వెంటనే పోలీసులకు, ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్‌స్టేషన్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. అప్పటికే జనరేటర్, ఆటోకు కొంతవరకు మంటలు అంటుకోవడంతో నష్టం వాటిల్లింది. జనరేటర్ బ్యాటరీ వైర్లు తొలగించకపోవడంతో మంటలు అంటుకున్నట్లు భావిస్తు న్నారు.

తహసీల్దార్ ఎదుట బైండోవర్

రామగిరి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బేగంపేట్, వకీల్‌పల్లే ప్లాట్‌లలో అక్రమంగా నాటు సారాయి అమ్ముతూ పట్టుబడిన పుల్లి రమేశ్, లావుడియా మౌనిక, గుగులోతు స్వామి, అనే ముగ్గురిని ఎక్సైజ్ శాఖ అదికారులు మంగళవారం తహసీల్దార్ సుమన్ ఎదుట బైండోవర్ చేశారు. రూ. లక్ష పూచికత్తులతో వీరిని బైండోవర్ చేసినట్లు తెలిపారు.

గొర్రెల దొంగలు పట్టివేత

శంకరపట్నం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం మొలంగూర్ శివారులో జనగామ పోలీసులు గొర్రెల దొంగతనం చేసిన వారిని పట్టుకున్నారు. కేశవపట్నంకు చెందిన కొందరు వ్యక్తులు జనగామలో ఓ గ్రామంలో పది గొర్రెలను దొంగతనం చేసి ఆటోలో తరలి స్తుండగా జనగామ పోలీసులు వెంబడించి మొలంగూర్ శివారులో పట్టుకున్నారు. దొంగలతో పాటు గొర్రెలను జనగామ పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం.

గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యం

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల అర్బన్ మండలం మోతె శివారులోని నవదుర్గ ఆలయ సమీపంలోని వ్యవసాయబావిలో మంగళవారం గుర్తుతెలియని 40 సంవత్సరాలు గల యువకుడి మృతదేహాన్ని గుర్తించినట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. మృతుడి కుడి చేతిపైన ఎస్.హన్మంతరావు అని రాసి ఉందని తెలిపారు. మృతుడి శరీరంపైన గోధుమరంగు చొక్కా, నేవీ బ్లూకలర్ ప్యాంటు ఉందన్నారు. మృతదేహాన్ని గుర్తించిన వ్యక్తులు జగిత్యాల రూరల్ ఎస్ఐ సధాకర్ సెల్‌నంబర్ 8712656822, కానిస్టేబుల్ మోహన్ సెల్‌నంబర్ 8712657800లో సంప్రదించాలని కోరారు.

సెంట్రల్ కమిటీ బాధ్యతలు చేపట్టిన వారంలోనే..

● పూర్తికాని కోస మృతదేహం పోస్టుమార్టం ● ఛత్తీస్‌గఢ్‌కు తరలివెళ్లిన బంధువులు ● గోపాల్‌రావుపల్లిలోనే అంత్యక్రియలు

సిరిసిల్ల క్రైం/కరీంనగర్ క్రైం, సెప్టెంబర్ 23 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం గోపాల్‌రావుపల్లి గ్రామానికి చెందిన కడారి సత్యనారాయణరెడ్డి అలియాస్ కోస, గోపన్న, సాధు మావోయిస్టు కేంద్రకమిటీ అధికార ప్రతినిధిగా బాధ్యతలు చేపట్టిన వారం రోజులకే ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లా అబూజుడ్‌మాన్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కేంద్రకమిటీ సభ్యుడు కడారి సత్యనారాయణరెడ్డి, రామచంద్రారెడ్డిలు మృతిచెందారు. కడారి సత్యనారాయణరెడ్డి మృతదేహాన్ని నారాయణపూర్ జిల్లా ఆసుపత్రి మార్చరీలో భద్రపర్చారు. మృతదేహాలకు మంగళవారం రాత్రి వరకు పోస్టుమార్టం పూర్తికాలేదు. మృతదేహంను కుటుంబ సభ్యులు గుర్తుపట్టి సత్యనారాయణరెడ్డిదేనని తేల్చాక బుధవారం పోస్టుమార్టం నిర్వహించే అవకాశం ఉంది. మృతదేహాన్ని తీసుకవచ్చేందుకు సిరిసిల్ల నుంచి కడారి సత్యనారాయణరెడ్డి అన్న కరుణాకర్‌రెడ్డి, సమీప బంధువులు నలుగురు నారాయణపూర్‌కు బయలుదేరారు. వీరు మంగళవారం రాత్రి చేరుకున్నారు. వీరి సమక్షంలోనే పోస్టుమార్టం పూర్తిచేసి కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించే అవకాశం ఉంది. సత్యనారాయణరెడ్డి విప్లవబాట పట్టిన 45సంవత్సరాల తర్వాత మృతదేహాన్ని స్వగ్రామమైన గోపాల్‌రావుపల్లికి తీసుకువస్తుండటంతో ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికేందుకు ఎదురుచూస్తున్నారు. బుధవారం ఏ రాత్రి అయినా గోపాల్‌రావుపల్లిలో అంత్యక్రియలు చేసేందుకు గ్రామస్థులు ఏర్పాట్లు చేస్తున్నారు.



కోసా ఇల్లు



గోపాల్‌రావుపల్లె గ్రామం

● రెండుసార్లు జైలుకు వెళ్లి అజ్ఞాతంలోకి..

కడారి సత్యనారాయణరెడ్డి 1980లో అప్పటి పీపుల్స్‌వార్‌లో చేరి అజ్ఞాతంలోకి వెళ్లారు. అప్పటికే సిమెంటు కర్మాగారంలో ఉద్యోగం చేస్తూ ఆ కంపెనీ మేనేజర్ హత్యకేసులో జైలుకు వెళ్లి వచ్చి అజ్ఞాతం బాట పట్టాడు. మళ్లీ 1996లో వరంగల్‌లో అరెస్టు అయి జైలుకు వెళ్లి మూడు నెలలకు బెయిల్‌పై వచ్చి మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లాడు.

● చివరిసారి 45 ఏళ్ల క్రితం ఉగాది పండుగరోజు చూశా..

- సత్యనారాయణరెడ్డి సోదరుడు కరుణాకర్‌రెడ్డి

1980 ఉగాదిన గోపాల్‌రావుపల్లిలో ఇద్దరం కలిసి కుటుంబ సభ్యులతో పండుగ చేసుకున్నట్లు కడారి సత్యనారాయణరెడ్డి సోదరుడు కరుణాకర్‌రెడ్డి తెలిపారు. మరుసటి రోజున కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీలో ఉద్యోగానికి సత్యనారాయణరెడ్డి వెళ్లిపోయాడు. నెల రోజులకు మా ఇంటికి పోలీసులు వచ్చి మీ తమ్ముడు ఒక హత్య కేసులో యూజీ(అండర్‌గ్రౌండ్)లోకి పోయాడని చెప్పారు. అప్పటి నుంచి నేటి వరకు మా తమ్ముడి గురించి ఎటువంటి సమాచారం లేదు. నేను కరీంనగర్‌లో డిగ్రీ చదువుతున్న సమయంలో తను ఇక్కడే మంకమ్మ తోటలో అద్దెగదిలో నాతో కలిసి ఉంటూ మల్టీపర్పస్ స్కూల్‌లో ఇంటర్ చదువుకున్నాడు. తమ్ముడు చాలా భయస్థుడుగా ఉండేవాడు. చదువుకునే సమయంలో తాను వెంట ఉంటేనే బయటకు వెళ్లేవాడు. సామాజిక మాధ్యమాలు, పత్రికల్లో వార్తలను చూడటం తప్ప ఏమీ తెలియదు. 6 నెలలకు ఒకసారి పోలీసులు వచ్చి కడారి సత్యనారాయణరెడ్డి బాగానే ఉన్నాడని, ఇంటికి వస్తే సమాచారం తెలపాలని కోరుతుండేవారని తెలిపారు.



రామచంద్రారెడ్డి, సత్యనారాయణ రెడ్డి(ఫైల్)

ఇద్దరి ప్రస్థానం పెద్దపల్లి నుంచే..

పెద్దపల్లి కల్చరల్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్‌లో సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో కడారి సత్యనారాయణరెడ్డి, కాతా రామచంద్రారెడ్డి మృతి చెందారు. వీరిద్దరి ఉద్యమ ప్రస్తానం పెద్దపల్లి జిల్లా నుంచే మొదలైంది. కదారి సత్యనారాయణరెడ్డి 1978 ప్రాంతంలో పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐలో టెక్నీషియన్‌గా ట్రైనింగ్‌పొంది బసంత్‌నగర్ కేశోరాంసిమెంట్ ఫ్యాక్టరీలో అప్రెంటిస్‌షిప్ చేస్తుండగా ఒకవర్గంతో ఘర్షణ పడి ఉద్యమంలోకి వెళ్లాడు. కాతా రామచంద్రారెడ్డి (66) అలియాస్ కట్టారామచంద్రారెడ్డి అలియాస్ రాజు దాదా అలియాస్ విజయ్ అలియాస్ వికల్ప్‌ది హుస్నాబాద్ ప్రాంతం. జిల్లాలోని పెంచికల్‌పేటలో ఎస్జీటీ టీచర్‌గా పనిచేశారు. టీచర్‌యూనియన్‌లో క్రియాశీలక కార్యకర్తగా విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, ప్రైవేటు ఉపాధ్యాయుల వేతన స్థిరీకరణకు పోరాడారు. అనంతరం నాందేడ్‌లో లా చదువుతూనే ఉద్యమం వైపు అడుగులు వేశాడు.

అంగన్‌వాడీ టీచర్ సస్పెన్షన్

● సూపర్‌వైజర్‌కు షోకాజ్ నోటీసు

హుజూరాబాద్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లోని వైన్‌షాపు పక్కన ఉన్న పర్మిట్ రూమ్‌లో అంగన్‌వాడీ కోడిగుడ్లు ప్రత్యక్షంపై రంగాపూర్ అంగన్‌వాడీ టీచర్ రాజమ్మను విధుల నుంచి తొలగిస్తూ జిల్లాకలెక్టర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. నాలుగురోజుల క్రితం హుజూరాబాద్ పట్టణంలోని కరీంనగర్ రోడ్‌లోని పర్మిట్‌రూమ్‌లో అంగన్‌వాడీ కోడిగుడ్లు ఉండడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ విషయంపై డీడబ్ల్యూవో సరస్వతి, ఎక్సైజ్ ఎస్ఐ వినోద్, సీడీపీవో సుగుణ విచారణ జరిపారు. ఈ కోడిగుడ్లురంగాపూర్ అంగన్‌వాడీ కేంద్రం-1 నుంచే తీసుకువచ్చారని నిర్ధారణకు వచ్చి నివేదికను జిల్లా కలెక్టర్‌కు పంపించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వహించిన అంగన్‌వాడీటీచర్ రాజమ్మను విధుల నుంచి తొలగించడంతో పాటు సూపర్‌వైజర్ శిరీషకు షోకాజ్ నోటీసులు, సీడీపీవో సుగుణకు మెమో జారీచేశారు.

భార్యను కులం పేరుతో దూషించిన భర్తకి ఏడాది జైలుశిక్ష

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భార్యను కులం పేరుతో దూషించి, రూ.5లక్షలు కట్నం తేవాలంటూ వేధించిన కేసులో నిందితుడు కూర అంజిరెడ్డికి ఏడాదిజైలు శిక్ష పడిందని కరీంనగర్‌రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామానికి చెందిన నిర్మలను 2017లో చెర్లబూత్కూర్‌కు చెందిన కూర అంజిరెడ్డి వివాహం చేసుకున్నాడు. వారికి ఒక కొడుకు ఉన్నాడు. భార్య నిర్మలను కులం పేరుతో దూషించి, రూ.5లక్షల కట్నం తేవాలంటూ డిమాండ్ చేయగా కరీంనగర్‌రూరల్ ఠాణాలో ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనట్లు చెప్పారు. ఈ కేసులో కరీంనగర్ కోర్ట్ సోమవారం నిందితుడికి ఏడాది జైలుశిక్ష, వెయ్యిరూపాయలు జరిమానా విధించినట్లు తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనల్లో ప్రజల భాగస్వామ్యం

● ఉల్లంఘనలకు సంబంధించి ఫొటోలతో వాట్సప్‌కు ఫిర్యాదు చేయాలి
● కరీంనగర్ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక కార్యక్రమం

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో ట్రాఫిక్ రోజు రోజుకు పెరిగిపోటవంతో వాహనదారులతో పాటు, పాదచారులకు కూడా తీవ్ర ఇబ్బందులు తలెత్తు తున్నాయి. రోడ్ల పక్కన ఫుట్‌పాత్‌లను ఆక్రమించటంతో పాటు, అడ్డదిడ్డంగా రోడ్డుపై వాహనాల పార్కింగ్, రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపటం వంటి ఉల్లంఘనలతో పాదచారులు రోడ్లపై నడవా లంటే భయాందోళనలకు గురవుతున్నారు. ఈ పరిస్థితిలో రోడ్డుపై వెళ్లే వాహనాలు ఢీకొని పాదచారులు, రాంగ్‌రూట్‌లో వెళ్లే వాహనాలతో ఇతరులు తరచుగా ప్రమాదాల బారిన పడుతున్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘనలపై ట్రాఫిక్ పోలీసులతో పాటుగా ప్రజలు ఎక్కడికక్కడ వాహన దారుల ఫొటోలు తీసి ట్రాఫిక్ పోలీసుల వాట్సప్ నెంబరుకు షేర్ చేసే విధంగా కరీంనగర్ పోలీసులు నూతనంగా ప్రజల భాగస్వామ్యంతో ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యక్రమాన్ని తీసుకువచ్చారు. ట్రాఫిక్ నిబంధనలును పటిష్ఠంగా అమలుచేయడంలో ప్రజల భాగస్వామ్యాన్ని కోరుతూ ట్రాఫిక్ పోలీసులు మంగళవారం ఒక కొత్త కార్యక్రమం ద్వారా వాట్సప్ నెంబర్ 9381919112ను ప్రవేశపెట్టారు. కమిష నరేట్ వ్యాప్తంగా వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘింస్తున్న వాహనదారుల ఫొటోలను వాట్సప్‌కు పంపిస్తే ఆ వాహనదారులకు జరిమానా విధిస్తామని పోలీసులు పేర్కొన్నారు. ముఖ్యంగా రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపటం, ట్రిబుల్ రైడింగ్, రోడ్డుపై అడ్డదిడ్డంగా వాహనాలను పార్క్ చేయటం వంటి ఉల్లంఘనలకు పాల్పడిన వాహనాల ఫొటోలను ప్రజలు నేరుగా తమ టైమ్‌స్టాంప్ కెమెరాతో ఫొటోలు తీసి వాట్సప్ నెంబరుకు పంపించవచ్చు. కరీంనగర్ పోలీస్‌కమిషనరేట్ పరిధిలో ట్రాఫిక్‌ను మరింత సురక్షితంగా, క్రమబద్ధంగా ఉంచడమే లక్ష్యంగా పెట్టుకున్నామని ట్రాఫిక్ పోలీసు లు చెబుతున్నారు. ప్రజలందరూ ఈ నూతన కార్యక్రమానికి సహకరించి, సురక్షిత ప్రయాణానికి తోడ్పడాలని ట్రాఫిక్ పోలీసులు కోరుతున్నారు.





భూ వివాదమే ప్రాణం తీసింది..

● పథకం ప్రకారమే రియల్టర్ రమేష్ హత్య
● ఇద్దరి అరెస్ట్.. పరారీలో మరొకరు..
● వెల్లడించిన ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): భూ వివాదంతోపాటు పెట్రోల్‌బంక్‌లో భాగస్వామ్యం ఇస్తానని మోసం చేయడం రియల్టర్ ప్రాణం తీసింది.. ఇందుకు ఇద్దరికి సుపారీ ఇచ్చి రమేష్ హత్యకు భాగస్వామి వ్యూహం పన్నాడు. పథకం ప్రకారం రమేష్‌ను పిలిచి హత్య చేశారు. ఈకేసులో ఇద్దరిని అరెస్ట్‌చేయగా, మరొకరు పరారీలో ఉన్నారని వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆమె వివరాలు వెల్లడించారు. సిరిసిల్ల మాజీ కౌన్సిలర్, రియల్టర్ సిరిగిరి రమేష్‌కు చందుర్తిలోగల భూమిని ఎస్సీ కార్పొరేషన్ లోన్‌పై పెట్రోల్ బంక్ కోసం చిర్రం రవి రిజిస్ట్రేషన్ చేశాడు. అయితే పెట్రోల్ బంక్ ఇవ్వక పోవడమే కాకుండా తిరిగి ఆ భూమిని రవికి రిజిస్ట్రేషన్ చేయలేదు. తన భూమి తనకు దక్కాలంటే సిరిగిరి రమేష్‌ను అంతం చెయ్యాలని చిర్రం రవి నిర్ణయించుకున్నాడు. ఇందుకు వేముల వాడకు చెందిన ఎద్దండి వెంకటేష్, అలా వంశీలకు సుపారీ ఇచ్చి హత్యకు వ్యూహం రూపొందించారు. పథకం ప్రకారం సిరిసిల్ల పట్టణంలోని పెద్దూరు సబ్‌స్టేషన్ సమీపంలో రమేష్‌ను కత్తితో పొడిచి హత్యచేశారు. రమేష్ చనిపోయాడని నిర్ధారించుకొని శవాన్ని ఎద్దండి వెంకటేష్ కారులో తీసుకవచ్చి వేములవాడలోని నంది కమాన్ సమీపంలోగల రమేష్‌కు చెందిన నందీశ్వర టౌన్‌షిప్ వెంచర్‌లో వదిలిపెట్టి పారిపోయారు. పోలీసులు తమ గురించి వెతుకుతారనే భయంతో పారి పోతుండగా వేములవాడలోని సాయిరక్షా దాబా సమీపంలో నిందితులైన ఏద్దండి వెంకటేష్, అలా వంశీలను పట్టుకొని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామని ఆమె తెలిపారు. వీరివద్ద ఇన్నోవా కారు, మొబైల్ ఫోన్, కత్తిని సీజ్ చేశామన్నారు. మరొకరు చిర్రం రవి పరారీలో ఉన్నాడని ఆమె తెలిపారు.

ఇసుక వేలం



ఇసుకను వేలం పాడుతున్న రెవెన్యూ అధికారులు

పాలకుర్తి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని బసంత్ నగర్ పోలీసులు గత నెలలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఇసుకను మంగళవారం ఆర్ఐ ఎన్ సంతోష్, జూనియర్ అసిస్టెంట్ మల్లారెడ్డి బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో బహిరంగా వేలం పాట నిర్వహించారు. వేలలో ముగ్గురుపాల్గొనగా అత్యధికంగా రూ.30వేలుపాడిన పూజారి చంద్రశేఖర్ ఇసుకను దక్కించుకున్నట్లు ఆర్ఐ తెలిపారు. ఈ వేలం పాటలో రెవెన్యూ సిబ్బంది లక్ష్మీనారాయణ, కాసార్ల తిరుపతి పాల్గొన్నారు.

26న ఇసుక వేలం

గన్నేరువరం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండ్లపల్లి స్టేజి వద్ద నుంచి ఈనెల 4న పట్టుకున్న రెండు లారీల్లో ఇసుకకు ఈనెల 26న రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో వేలం నిర్వహించనున్నట్లు తహసీల్దారు నరేందర్ మంగళవారం ఒకప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో పాల్గొనదలచిన వారు ముందుగా ఐదు వేలను చెల్లించాలని తెలిపారు.

గుండెపోటుతో పారిశుధ్య కార్మికుడు మృతి



దుర్గయ్య(ఫైల్)

తిమ్మాపూర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోరండ్ల గ్రామపంచాయితీ కార్యాలయంలో పారిశుధ్య కార్మికుడిగా విధులు నిర్వర్తిస్తున్న కిన్నెర దుర్గయ్య(62) మంగళవారం గుండెపోటుతో మృతిచెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. విధుల్లో భాగంగా మంగళవారం ఉదయం దుర్గయ్య గ్రామంలో పారిశుధ్య పనులు చేసి ఇంటికి వెళ్లాడు. ఇంట్లో సేద తిరుతుండగా ఒక్కసారి గుండెల్లో నొప్పి రావడంతో స్థానికంగా ఉన్న ఆర్‌ఎంపీని పిలిపించారు. అయితే అప్పటికే దుర్గయ్య గుండెపోటుతో మృతిచెందాడు. మృతుడు దుర్గయ్యకు భార్య ముగ్గురుసంతానం ఉన్నారు. దుర్గయ్యపైనే కుటుంబంఅంత జీవిస్తుండగా, అతడు మృతి చెందడంతో కుటుంబం ఇంటి పెద్దను కోల్పోయి, కన్నీరు మున్నీరుగా విలపించారు. ప్రభుత్వం దుర్గయ్య కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

తొమ్మిది మంది పేకాటరాయుళ్ల పట్టివేత

మల్యాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం తాటిపల్లి గ్రామశివారులో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని పట్టుకొని వారి వద్ద రూ.27070 నగదుస్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

విత్తన ధాన్యం డబ్బులు రాక రైతుల గోస

● పండగపూట ఆందోళనలో అన్నదాతలు
● మూడు నెలలైనా అందని డబ్బులు
● ముఖం చాటేస్తున్న ఆర్గనైజర్లు
● పట్టించుకోని అధికారులు

వీణవంక, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సీడ్ ధాన్యం డబ్బులు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పండగపూట చేతిలో చిల్లిగవ్వ లేక పండించిన పంటకు డబ్బులు రాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వీణవంక మండలంలోని 26గ్రామాల్లో ఖరీఫ్ సీజన్ దాదాపు 18వేల ఎకరాలలో ఆడ మగ సీడ్ వరిని రైతులు పండించారు. దిగుబడి కూడా బాగానే వచ్చింది. బ్రహ్మణపల్లి, బేతిగల్, రెడ్డిపల్లి, వీణవంక, నర్సింగాపూర్, కనపర్తి, ఎల్బాక, గంగారం, మామిడాలపల్లి, లస్మక్కపల్లి, కొర్కల్, మాల్లారెడ్డిపల్లి, చల్లూరుతో పాటు గ్రామాల్లో రైతులు సీడ్‌వరి పండించారు. సీడ్‌రైతులకు దాదాపు 25కోట్ల రుపాయల వరకు రావాల్సిఉన్నది. డబ్బులు చెల్లించకుండా సీడ్ కంపెనీలు, ఆర్గనైజర్‌లు ముఖం చాటేసారు. ఎవరికి చెప్పాలో తెలియక రైతులు గ్రామాల్లోని ఆర్గనైజర్‌ల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు. వర్షాకాలం పంట పెట్టుబడికి అందుతాయని సీడు వరి పండిస్తే పెట్టుబడులకు అప్పులు చేయాల్సి వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కౌలు రైతులకు డబ్బులు రాక పంట పెట్టుబడికి అప్పులు చేస్తున్నారు. ఆర్గనైజర్‌ల ఇళ్ల చుట్టూ తిరిగితే రూ.10వేలు ఇచ్చి కంపెనీ ఇస్తే ఇస్తామని చెపుతున్నారు.



విత్తన వరిలో బెరికి మొక్కలను తొలగిస్తున్న మహిళా రైతులు, కూలీలు(ఫైల్)

● అమలు కాని ఒప్పందం..

పంట నష్టపోయినా, చెప్పిన ప్రకారం దిగుబడి రాకున్నా సీడ్ కంపెనీ డబ్బులు ఇస్తుందని చెప్పి సీడ్ ఆర్గనైజర్‌లు రైతులతో ఒప్పందాలు చేసుకుంటున్నారు. తమ సీడ్ పండించా లంటూ రైతులను మభ్యపెడుతున్నారు. ఒప్పందం ప్రకారం బాండ్ పేపర్ ఇచ్చినా అనుకున్న ప్రకారం ఆర్గనైజర్‌లు డబ్బులు చెల్లించకపోవడంతో రైతులు ఏమీ చేయలేక పోతున్నారు. కొంతమంది ఆర్గనైజర్‌లు రైతుల నుంచి ధాన్యం సేకరించి సీడ్ కంపెనీకి పంపించ కుండా ప్రైవేటుగా విక్రయిస్తున్నారు. డబ్బులు చెల్లిం చాలని రైతులు అడిగితే మొండిచేయి చూపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతి యేటా నష్ట పోతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని సీడ్ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని పటిష్ఠమైన నిబం.దనలు రూపొందించాలని రైతులు కోరుతున్నారు. రైతులకు సీడ్ డబ్బులు కంపెనీలు చెల్లించడం లేదని మండల వ్యవసాయ అధికారిని వివరణ కోరగా కొంత మంది రైతులకు కొన్ని కంపెనీలు చెల్లించ లేదని రైతులు చెపుతున్నారన్నారు. కానీ ఎవరూ నేరుగా ఫిర్యాదు చేయడం లేదని తెలిపారు. నష్టపో యిన రైతులు ఫిర్యాదు చేస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి డబ్బులు అందేలా చేస్తామని తెలిపారు.

రాష్ట్రంలో నిర్వీర్యమవుతున్న ప్రభుత్వ విద్య



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు

భగత్‌నగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్య పూర్తిగా నిర్వీర్యమవుతున్నదని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు అన్నారు. మంగళవారం నగరంలోని ముకుందలాల్ మిశ్రా భవన్‌లో రాష్ట్ర విద్యా వైజ్ఞానిక శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థుల గోడు పట్టించుకునే నాథుడు లేడన్నారు. రాష్ట్రంలో కనీసం విద్యాశాఖకు మంత్రి లేకపోవడం బాధకరమన్నారు. ఎస్ఎఫ్ఐ మాజీ నాయకుడు మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ దేశంలో అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఎస్ఎఫ్ఐ ఉందన్నారు. విద్యారంగ సమస్యలపై సమరశీల పోరాటాలు చేస్తున్న ఘనత ఎస్ఎఫ్ఐదే అన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు శనిగరపు రజనీకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరంలో ఐటిఐలో ప్రవేశాలు చేపట్టకుండా నిలిపి వేశారన్నారు. ప్రభుత్వం సంప్రదాయ ట్రేడ్లలో అడ్మిషన్లు చేయకుండా నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మక్కపెల్లి పూజ, సహాయ కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్, కిరణ్, ప్రశాంత్, కాంపెల్లి అరవింద్, రాష్ట్ర కమిటీ నాయకులు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

క్రిమిసంహారక మందు తాగి డ్యాన్స్ మాస్టర్ మృతి



శేఖర్(ఫైల్)

రామడుగు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం గోపాల్‌రావు పేట గ్రామానికి చెందిన దాసరి శేఖర్ అనే డ్యాన్సర్, కొరియోగ్రాఫర్ క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్సపొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. శేఖర్ గ్రామంలో ఓ ప్రైవేట్ స్కూల్ డ్యాన్స్ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. అయితే ఆదివారం గడ్డిమందు తాగి పడిపోగా వెంటనే కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడచికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతికిగల కారణాలు ఇంకా తెలియరాలేదు. గ్రామంలో మంచిపేరు ఉన్న యువకుడు అకారణంగా మృత్యువాత పడడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఒకరి అరెస్టు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ ఆడుతున్న మహిళలపై రాళ్లు రువ్విన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. కొత్తపల్లి మండలం చింతకుంటలోని శాంతినగర్ ప్రైమరీ స్కూల్ గ్రౌండ్‌లో ఈ నెల21నరాత్రి 9 గంటలకు స్థానిక మహిళలు బతుకమ్మ ఆడుతున్నారు. అదే కాలనీకి చెందిన షేక్ సజ్జు రాళ్లను విసరగా అక్కడఉన్న కాసారపు లక్ష్మి, మధురెడ్డి ఎల్లమ్మ, మొగిలి అకిరానందుకు గాయాలయ్యాయి. ఘటనపై కాసారపు లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు, షేక్ సజ్జును అరెస్టుచేసి కోర్టుకు తరలించినట్లు కొత్తపల్లి సీఐ బిల్ల కోటేశ్వర్ తెలిపారు.

- సామాజిక మార్పు దిశగా విద్యార్థులు
- నేడు ఎన్ఎస్ఎస్ దినోత్సవం



రక్తదానం చేస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

సమ సమాజం.. జనహితం

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వ్యక్తి వ్యక్తికోసం కాదు సమాజ నిర్మాణం కోసం దోహద పడాలనే పూజ్య బాపూజీ ఆశయం మేరకు 1969 సెప్టెంబర్ 24న అప్పటి విద్యా శాఖ మంత్రి వికెఆర్‌వి రావు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)ను ప్రారంభించారు. సమాజ శ్రేయస్సు కోసం అంకిత భావంతో కృషిచేసే యువతను తయారు చేసేందుకు ప్రయోగాత్మకతంగా దేశంలోని 37 విశ్వ విద్యాలయాలలో 40 వేల మంది వలంటీర్లతో ఎన్ఎస్ఎస్‌ను ప్రారంభించారు. ప్రస్తుతం దేశంలో 440 యూనివర్సిటీలలో 4 లక్షల 20 వేల వలంటీర్లతో, శాతవాహన విశ్వ విద్యాలయ పరిధిలో 135 యూనిట్లతో సుమారు 15,000 మంది వలంటీర్లతో ఎన్ఎస్ఎస్ ఒక శక్తివంతమైన వారధిగా తయారైంది. విద్యార్థులు సామాజిక బాధ్యతను విస్మరించకుండా సమాజంలో ఉన్న అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేసే విధంగా వలంటీర్లను జాతీయ సేవా పథకం తీర్చిదిద్దుతుంది. కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖ, యువజన సర్వీసులు, క్రీడా శాఖల సంయుక్త నిర్వహణలో ఎన్ఎస్ఎస్ ప్రస్తానాన్ని కొనసాగిస్తోంది. విద్యార్థుల్లో సేవాభావాన్ని, నాయకత్వ లక్షణాలను మెరుగు పరుస్తూ జాతికి అమూల్యమైన మానవ వనరులను అందిస్తున్న ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 24న నిర్వహించుకుంటున్నాం.

● ఎన్ఎస్ఎస్ లోగో...



ఒరిస్సా రాష్ట్రంలో కోణార్క్ సూర్య దేవాలయంలోని రథ చక్రాన్ని ఎన్ఎస్ఎస్ లోగోగా (చిహ్నం) గా తీసుకున్నారు. చక్రం అనేది ప్రగతికి, మార్పుకు చిహ్నం. ఈ చక్రంలో ఎరుపు రంగు యువత స్వచ్ఛమైన రక్తంతో ఆరోగ్యంగా ఉన్నారని, నీలి రంగు విశాల విశ్వంలో నేను సైతం సమాజ చైతన్యానికి కృషి చేస్తాననే సంకేతాన్ని ఇస్తుంది. ఈ చక్రంలో 8 పుల్లలు కలవు. అవసరమైతే 24 గంటలు సమాజ సేవకు సిద్ధమని సంకేతం.

● ఎన్ఎస్ఎస్ నినాదం..

నాట్ మీ - బట్ యూ అనే నినాదంతో ప్రారంభం అవుతుంది. 'నా కోసం కాదు మీ కోసం' అనగా నేను సామాజిక మార్పుకు సిద్ధంగా ఉన్నానని అర్థం.

● విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపు

భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు వారసత్వం, విలువలపట్ల అవగాహన కల్పించడానికి ఎన్ఎస్ఎస్ వివిధ కార్యక్రమాలు చేపడుతుంది. శ్రమదానం మాత్రమే ప్రాధాన్యం ఇవ్వకుండా విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపుదలకు తోడ్పాడు అందిస్తుంది. ఉత్తమ సమాజం, ఆదర్శ సమాజ నిర్మాణంలో విద్యార్థులు పాలు పంచుకునేలా చేస్తూ సమాజ సేవతో తమ అనుభవాన్ని పెంచుకునేలా ఎన్ఎస్ఎస్ దోహదపడుతుంది. ఒకప్పుడు శ్రమదాన కార్యక్రమాలకు ఎన్ఎస్ఎస్‌లో ప్రాధాన్యం ఉండగా నేడు విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపుదలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ యువతలోని సృజనాత్మకతను వెలుగులోకి తెస్తున్నారు.

● ఎన్ఎస్ఎస్‌లో అవార్డు గ్రహీతలు

పూర్వ లైజన్ అధికారి డాక్టర్ ఎం శంకరయ్య, కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మధుసూదన్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కలువకుంట్ల రామకృష్ణ, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సంగోజు మనోహరాచారి, ఆర్ గోపికృష్ణ, డాక్టర్ వడ్లూరి శ్రీనివాస్, డాక్టర్ ఎండి ఆలీఖాన్, వలంటీర్లు చుక్క శ్రీనివాస్, అవంతి, బోడి ఆంజనేయులు, టి నవీన్, కె చంద్రశేఖర్, నక్క అనితలు ఎన్ఎస్ఎస్‌లో సత్తా చాటి జాతీయ, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఎన్ఎస్ఎస్ అవార్డులను సొంతం చేసుకున్నారు.

● ఎస్ఆర్ఆర్ కళాశాలలో

ఉత్తర తెలంగాణలో అతి పెద్దదైన శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో 1975లో వంద మంది వలంటీర్లచే ఎన్ఎస్ఎస్ ప్రారంభమైంది. ప్రస్తుతం 5 యూనిట్లు, ఐదుగురు ఎన్ఎస్ఎస్ అధికారులు, 5 వందల మంది వలంటీర్లచే ప్రభుత్వ ఆశయాలను అక్షరాల ఆచరణలో చూపుతూ నాటి నుంచి నేటి వరకు ఎన్నో సామా జిక కార్యక్రమాలు చేపట్టారు. కళాశాల ఎన్ఎస్ ఎస్ వలంటీర్లు నాలుగు ఎకరాల స్థలాన్ని పూల వనంగా మార్చడంతో పాటు చెక్ డ్యాంల నిర్మాణం, హరితహారం కార్యక్రమం, ఓటరు అవగాహన ర్యా లీలు, రక్తదాన శిబిరంలలో పాల్గొంటూ కళాశాల వైభవాన్ని రాష్ట్ర, జాతీయస్థాయిలో చాటుతున్నారు.



బతుకమ్మలతో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు

ఎన్ఎస్ఎస్‌తో సామాజిక స్పృహ పెరుగుతుంది

- డాక్టర్ కలువకుంట్ల రామకృష్ణ, ఎస్ఆర్ఆర్ ప్రిన్సిపాల్



ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలలో పాల్గొనడం ద్వారా వ్యక్తిత్వ వికాసం, సామాజిక స్పృహ, దేశభక్తి పెరిగి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగే అవకాశం ఉంది. నాయకత్వ లక్షణాలను పెంపొందించుకునేందుకు ఎన్ఎస్ఎస్ చక్కని వేదికగా ఉపయోగ పడడమే కాక భవిష్యత్తులో ఏ రంగంలోనైనా స్థిర పడేందుకు కావాల్సిన నైపుణ్యాన్ని ఆత్మ విశ్వాసాన్ని పెంచుతుంది.

సామాజిక స్పృహ సేవాభావం పెంపొందుతాయి

-పడాల తిరుపతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి



నేను గత 5సంవత్సరాలుగా ఎన్ఎస్ఎస్ పీవోగా సేవలు అందిస్తున్నాను. ఎన్ఎస్ఎస్‌తో యువతలో సామాజిక స్పృహ సేవాభావం, సోదరభావం, సమైక్యత భావం పెంపొందుతాయి. కళాశాలలోని ఎన్ఎస్ఎస్ వలంటీర్లలో సామాజిక అవగాహన పెరుగుతుంది. నాయకత్వ లక్షణాలు సంభాషణా నైపుణ్యాలు పెంపొందుతాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలను చైతన్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తోడ్పడుతారు.

సమాజ నిర్మాణంలో భాగస్వామిని అవుతా..

- బొజ్జ శ్రీకాంత్, ఎన్ఎస్ఎస్ వలంటీర్



నేను ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా పనిచేస్తున్నాను. ఇంత వరకు శ్రమదానం, హరితహారం, ట్రాఫిక్ నియంత్రణ తదితర సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. ఒక ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా సమాజ సేవ చేయడం ఆనందంగా ఉంది. ప్రస్తుతం సమాజంలో కనుమరుగవుతున్న నైతిక విలువల ఆవశ్యకతను తెలుసుకున్నాను. ముమ్ముందు వివిధ గ్రామాల్లో పర్యటించి అసాంఘిక శక్తుల పట్ల గ్రామీణులను ఉత్తేజపరుస్తాను. దేశ సేవ పరమావధిగా ఎన్ఎస్ఎస్‌లో పాల్గొంటున్నాం.

బ్రహ్మచారిణి అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు





వేములవాడలో, ధర్మపురిలో బ్రహ్మచారిణి రూపంలో దర్శనమిస్తున్న అమ్మవారు



కొండగట్టులో గాయత్రిదేవిగా అమ్మవారు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయంలో మంగళవారం దుర్గామాత అమ్మవారు బ్రహ్మచారిణి అలంకారంలో దర్శనమిచ్చారు. శ్రీదేవినవరాత్రోత్సవాల్లో భాగంగా రాజన్న ఆలయంలో శ్రీస్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయఅర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజన్నఆలయంలో జరుగుతున్న అభివృద్ధిపనుల్లో భాగంగా మంగళవారం ఆలయంలోని ప్రధానకార్యలయాలను శ్రీభీమేశ్వర సదన్‌లోకి మార్చారు. ఈ సందర్భంగా ఈవో రమాదేవి బీమేశ్వర సదన్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యాలయాన్ని ప్రారంభించారు.

ధర్మపురి: ధర్మపురిక్షేత్రంలోని లక్ష్మీనృసింహస్వామి, అనుబంధ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో దేవి నవరాత్రోత్సవాలు రెండో రోజు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయవేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. దుర్గాదేవి బ్రహ్మచారిణి రూపంలో భక్తులకు దర్శనం ఇచ్చింది. భక్తులు అమ్మవారలను దర్శనం చేసుకున్నారు. శ్రీ యోగ, ఉగ్ర నరసింహస్వామి వారల సేవలను ఐరావత వాహనంపై పురవీధుల గుండా ఊరేగింపు జరిపారు. టీటీడీ కళ్యాణ మండపంలో నవదుర్గ సేవా సమితి, చింతామణి చెరువు వద్ద మహాశక్తి సేవా సమితి, తిమ్మాపూర్ శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో, ఒజ్జల వీధిలో, నేరెళ్లలో అమ్మవారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో అనంత దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జుక్కు రవీందర్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

కొండగట్టులో గాయత్రిదేవిగా..

మల్యాల: కొండగట్టు అంజన్న సన్నిధిలో జరుగుతున్న దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా రెండవ రోజు మంగళవారం అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించగా ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ నుంచి నీటి విడుదల

● 40 గేట్ల ద్వారా 2,38,720 క్యూసెక్కులు దిగువకు

జగిత్యాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ 40గేట్లు పైకి ఎత్తి 2,38, 720క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 73.37 టీఎంసీల నీరునిల్వ ఉంది. వరదకాలువకు 6,735క్యూసెక్కులు, కాకతీయ కాలువకు 5,500, సరస్వతీ కాలువకు 400 క్యూసెక్కులు, లక్ష్మీ కాలువకు 200 క్యూసెక్కులు, అలీ సాగర్ ఎత్తిపోత పథకానికి 180క్యూసెక్కులు విడుదల అవుతోంది.

'అన్నపూర్ణ'లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతగిరి గ్రామసమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి ఒక పంపుద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 3.25టీఎంసీల నీరు ఉంది. మధ్య మానేరు ద్వారా వస్తున్న 3200క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తుండగా, ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 3300క్యూసెక్కుల నీటిని విడుదలచేస్తున్నారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

బోయినపల్లి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వర జలాశయానికి(మిడ్‌మానేరు) ప్రాజెక్టుకు మంగళవారం 9800క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ఎస్సారెస్పీ నుంచి వరదకాలువ ద్వారా 4500 మానేరు, మూలవాగుద్వారా 5300క్యూసెక్కుల నీటిప్రవాహం కొనసాగుతోంది. దిగువకు రెండు గేట్ల ద్వారా 5000 క్యూసెక్కులు, ప్యాకేజీ 9లోని మల్కపేట రిజర్వాయర్‌కు 561 క్యూసెక్కులు, ప్యాకేజీ 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 3200క్యూసెక్కులనీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318మీటర్లకు ప్రస్తుతం 318.89ఉండగా, సామర్థ్యం 27.55 టీఎంసీలకు 27.273 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

ఎల్లంపల్లి ప్రాజెక్టు 38 గేట్ల ద్వారా నీటి విడుదల

అంతర్గాం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి ప్రాజెక్టుకు కడెం ప్రాజెక్టు నుండి 5273 క్యూసెక్కులు, శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుండి 2.38 లక్షల క్యూసెక్కులు, వాగులు, వంకల నుండి 1.86 లక్షల క్యూసెక్కులు మొత్తం 4.3 లక్షల క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. దీంతో మంగళవారం ఎల్లంపల్లి ప్రాజెక్టు అధికారులు 38గేట్లు ఎత్తి 4.3లక్షల క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 20టీఎంసీలకు గాను ప్రస్తుతం 18.34టీఎంసీ నీరు నిల్వ ఉంది. ప్రాజెక్ట్ వద్ద అధికారులు అప్రమత్తంగా ఉంటూ వరద పరిస్థితిని సమీక్షిస్తున్నారు. గోదావరి పరివాహక ప్రాంతాల్లోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని పోలీస్, రెవెన్యూ అధికారులు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. వరద ఉధృతి కొనసాగుతున్న నేపథ్యంలో ప్రాజెక్ట్ నుంచి అంతర్గాం, మంచిర్యాలకు రాకపోకలను ప్రాజెక్ట్ అధికారులు నిలిపివేశారు.

పార్వతీ బ్యారేజ్ నుంచి...

మంథనిరూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరిపురం సమీపంలోని పార్వతీ (సుందిళ్ల) బ్యారేజ్‌లో మంగళవారం సాయంత్రం వరకు భారీగా వరద నీరు పెరిగింది. పైన ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టులో గేట్లు ఎత్తి నీరు దిగువ ప్రాంతానికి వదలడంతో పార్వతీ బ్యారేజ్‌లోకి 4 లక్షల 30వేల క్యూసెక్‌ల భారీ వరద నీరు వచ్చి చేరింది. అయితే ప్రాజెక్టులో ఉన్న 74 గేట్లు ఎత్తి ఉండటంతో వరద నీరు దిగువకు విడుదల అవుతుంది. రెండు రోజుల క్రితం బ్యారేజ్‌లో వరద నీరు తగ్గుముఖం పట్టగా మళ్లీ పైన ఎల్లంపల్లిలో గేట్లు ఎత్తడంతో దిగువకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది.

13తులాల బంగారం పోగొట్టుకున్న యువకుడు

హుజూరాబాద్ రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపూర్ గ్రామానికి చెందిన ఓ యువకుడు 13తులాల బంగారాన్ని పోగొట్టుకున్న సంఘటన వెలుగులోకి వచ్చింది. మండలంలోని రంగాపూర్‌కి చెందిన రెడ్డిబోయిన రమేష్ హనుమకొండ జిల్లా వేలేరు గ్రామం నుంచి సొంత గ్రామానికి బయలుదేరాడు. ప్రయాణానికి ముందు అతను 13తులాల బంగారు ఆభరణాలు, కొన్ని సీతాఫలాలను ఒకసంచిలో ప్యాక్ చేసి తనబైక్‌కు తగిలించుకున్నాడు. వేలేరునుంచి బయలుదేరిన తర్వాత హుజూరాబాద్ మండలంలోని ఇప్పల్‌నర్సింగాపూర్ గ్రామం వరకు ఆ సంచి బైక్‌కు ఉంది. కానీ ఆ గ్రామం దాటిన తర్వాత సంచి పోయినట్లు రమేష్ గుర్తించాడు. వెంటనే అతను వెనక్కి వెళ్లి వెతికాడు. కానీ ఆ సంచి ఆచూకీ లభించలేదు. గత ఆదివారం జరగగా రెండ్రోజుల పాటు వెతికాడు. అయినా సంచి దొరకకపోవడంతో పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. బంగారు ఆభరణాలు, సీతాఫలాలున్న సంచి ఎవరికైనా దొరికితే పోలీస్ స్టేషన్లో అప్పగించాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గాంధీనగర్‌లో పట్టపగలు చోరీ



దొంగతనం జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐ

ఇల్లందకుంట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల గ్రామపరిధిలోని గాంధీనగర్‌లో పట్టపగలు ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్‌కు చెందిన గూడెపు మల్లమ్మ మంగళవారం ఉదయం 11గంటలకు ఇంటి ముందు వరండాలో పడుకొని ఉంది. కొద్దిసేపటికి వరండా పక్కనున్న రూమ్ యొక్క తలుపులు తెరిచి ఉన్నాయి. వెంటనే గదిలో ఉన్నటువంటి బీరువాను తెరిచి చూడగా తాళం తీసి ఉంది. అందులో ఉన్న రూ.25వేలు దొంగిలించినట్లు తెలిపింది. మల్లమ్మ ఫిర్యాదు మేరకు సీఐ లక్ష్మీనారాయణ, ఎస్ఐ క్రాంతి కుమార్ ఫింగర్ ప్రింట్ నిపుణులతో సంఘటన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దసరా ప్రయాణికులకు ఆర్టీసీ లక్కీడ్రా

భగత్‌నగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దసరా పండుగ సందర్భంగా ప్రయాణికులకు ఆర్టీసీ ఆధ్వర్యంలో లక్కీ డ్రా నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ రీజినల్ మేనేజర్ బి.రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27వ తేదీ నుంచి అక్టోబరు 6వతేదీ వరకు ప్రయాణించిన వారికి లక్కీడ్రా వర్తిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డురవాణా సంస్థ ఆధ్వర్యంలో నడిపిస్తున్న సెమీడీలక్స్, డీలక్స్, మెట్రో డీలక్స్, సూపర్‌లగ్జరీ, లహరితోపాటు అన్నిరకాల ఏసీ బస్సుల్లో ప్రయాణం చేసిన వారికి లక్కీడ్రా నిర్వహించాలని సంస్థ నిర్ణయించిందని తెలిపారు. కరీంనగర్ రీజియన్ పరిధిలోని ఉమ్మడి జిల్లా లోని అన్ని ప్రధానబస్‌స్టేషన్లలో లక్కీడ్రా బాక్సులు ఉంటాయని, ప్రయాణం చేసిన టికెట్ల వెనుకభాగంలో అడ్రస్, ఫోన్‌నంబరు రాసిఅందులో వేయాలని సూచించారు. అక్టోబరు 8వతేదీన సాయంత్రం 4గంటలకు డ్రా తీయనున్నట్లు తెలిపారు.

మొదటి విజేతకు రూ.25 వేలు, రెండో విజేతకు రూ.15 వేలు, మూడో విజేతకు రూ.10వేలను చెక్కులరూపంలో అందించనున్నట్లు పేర్కొ న్నారు. లక్కీడ్రా తేదీల్లో ముందస్తు రిజర్వేషన్లు చేసుకున్న ప్రయాణి కులు కూడా అర్హులేనని తెలిపారు. సురక్షితమైన ప్రయాణానికి ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలని కోరారు.

పోలీస్ ఫైరింగ్ ప్రాక్టీస్‌లో
వృద్ధురాలికి తూటా

- త్వరలో ఎక్స్‌పర్ట్ టీం పరిశీలన : సీఐ బిల్ల కోటేశ్వర్



కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 23 (ఆంధ్ర జ్యోతి): కొత్తపల్లి మండలం ఎలగందుల గ్రామపంచాయతీ పరిధిలోని గుట్ట వద్ద పోలీస్ ఫైరింగ్ రేంజిలో గత శనివారం జరిగిన పోలీసుల ఫైరింగ్ శిక్షణ సందర్భంగా సమీపంలో ఉన్న బోనాలపల్లికి చెందిన అమృతమ్మ అనే వృద్ధురాలికి తు పాకీ తూటా తగిలి గాయమైందని బాధితురాలితో పాటు గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహించే కానిస్టేబుల్ నుంచి పోలీస్‌కమిషనర్ వరకు ఏడాదికి ఒకసారి పోలీసుల వద్ద ఉన్న ఆయుధాలతో ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహిస్తుంటారు. కమిషనరేట్ పోలీసు లందరూ ఎలగందులలోని ఫైరింగ్ రేంజి గుట్ట వద్ద 300 మీటర్ల దూరంలో ఒక టార్గెట్‌ను ఏర్పాటు చేసి ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తుంటారు. టార్గెట్ వెనుక గుట్ట ఉండటంతో ఎవరికి ఎలాంటి హాకలుగ కుండా ఉండేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఉంటాయి. ఈ ప్రాక్టీస్ సమయంలో సమీ పంలోని గ్రామస్థులు జాగ్రత్తలు తీసుకో వాలని డప్పుచాటింపు కూడా చేయిస్తుం టారు. అయితే శనివారం కరీంనగర్ పో లీస్ కమిషనరేట్‌లోని నూతనంగా వచ్చిన కానిస్టేబుళ్లు ఫైరింగ్ ప్రాక్టీస్ చేశారు. అయితే ఫైరింగ్ రేంజి గుట్ట వెనుకవైపున 500 మీటర్ల దూరంలో బోనాలపల్లి ఉం టుంది. ఈ పల్లెలోని ఇళ్ల వరకు తూటాలు వచ్చిపడినట్లు పల్లెవాసులు చెబుతున్నారు. అమృతమ్మ తొడ భాగంలో రాయివంటిది తాకి గాయంకాగా, అక్కడే ఒక ఖాళీ తూటా పడి ఉందని చెబుతున్నారు. ఈ తూటా తగలటంతోనే తనకు గాయమైం దని అమృతమ్మ చెబుతున్నది. అయితే 3, 4 దశాబ్దాల కాలం నుంచి పోలీసులు ఎలగందుల సమీపంలోని గుట్ట వద్దనే ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తున్నారు. అయితే ఎలగందుల ఫైరింగ్ రేంజి వద్ద గుట్ట నుంచి గ్రానైట్ వెలికితీస్తున్న కారణంగా ఆ గుట్ట ఎత్తు తగ్గటంతోనే తుపాకీ నుంచి వెలువడిన తూటాలు గుట్టపై నుంచి బోనాలపల్లి సమీపంలో పడుతున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. ఇదే విషయమై కొత్తపల్లి ఎస్ఐ బిల్ల కోటేశ్వర్‌ను వివరణ అడగగా అమృతమ్మ అనే వృద్ధురాలికి గాయమైన మాట వాస్తవమేనని, ఒక తూటా కూడా లభించిందని, దీనిపై విచారణ జరుపుతున్నామని తెలిపారు. ఎలగందుల ఫైరింగ్ రేంజిలో పోలీసుల ఫైరింగ్‌కు భద్రతాపరంగా అనుకూలమా? లేదా? అనే విషయాన్ని తేల్చడానికి హైదరాబాద్ నుంచి ఒక ఎక్స్‌పర్ట్ టీం త్వరలో వస్తుందని, ఆ టీం రిపోర్ట్‌కు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు.



పోలీసులు ఫైరింగ్ ప్రాక్టీస్ చేసే గుట్ట ప్రాంతం

ఏనాడూ ఇటువంటి ఘటన ఎదురుకాలేదు

- బోనాల నరేష్, ఎలగందుల మాజీ ఉపసర్పంచ్



నా చిన్నప్పటి నుంచి చూస్తున్నా. ఏడాదిలో 3, 4 సార్లు పోలీసులు ఫైరింగ్ ప్రాక్టీస్ చేస్తుంటారు. ఏనాడు కూడా ఇటువంటి ఘటన ఎదురుకాలేదు. బుల్లెట్‌లు తగిలిన దాఖలాలు లేవు. గుట్ట ఎత్తు తగ్గిపోవటంతో జరిగి ఉంటుందని భావిస్తున్నాం. భద్రతా చర్యలు తీసుకుంటూ ఫైరింగ్ రేంజిని కొనసాగించాలి,

ఆల్ ఇండియా ట్రెక్కింగ్‌కు ఎన్‌సీసీ కెడెట్లు



అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపాల్, ఎన్‌సీసీ ఆఫీసర్లు

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో ఈనెల 25వ తేదీ నుంచి నిర్వహించనున్న ఆల్ ఇండియా ట్రెక్కింగ్ ఎక్స్‌పెడిషన్‌కు గోదావరిఖనికి చెందిన సెక్రెడ్ హార్ట్ హైస్కూల్ 9వ తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ కెడెట్లు ఎ.ఆర్యవర్ధన్, టి.సూర్యకిరణ్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ ఆరోగ్యమేరి, కరస్పాండెంట్ మరియాగోరేటి, టెకిలా, ఎన్‌సీసీ ఫస్ట్ ఆఫీసర్ జ్యోత్స్న, 9వ బెటాలియన్ హవల్దార్ అజ్మద్ అలీ, సప్నల్ మహోరే అభినందించారు. తిరుపతిలోని పలు కొండ ప్రాంతాలు, అటవీ ప్రాంతలను సందర్శించనున్నారు.

గంగాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు

మంథనిరూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బెస్తపల్లి గ్రామంలోని గంగాదేవి ఆలయంలో నిత్యదీపారాధన కమిటీ ఆధ్వర్యంలో నెలకొల్పిన అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేడి రవి-స్వప్న దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. బెస్తపల్లి, దుబ్బపల్లి, చందనపూర్‌కు చెందిన గంగపుత్రులు పూజలు నిర్వహించారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా ప్రవీణ్

మంథని, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): టీఎస్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా మంథనికి చెందిన గుండోజు ప్రవీణ్ నియామకమయ్యారు. సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్, రాష్ట్ర కార్యదర్శి పెండ్యాల రాంకుమార్ నియామక పత్రాన్ని మంగళవారం ప్రవీణ్‌కు అందజేశారు. సంఘంలో బలోపేతం కోసం కృషి చేస్తానని ప్రవీణ్ తెలిపారు. ఆయన నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. నాయకులు శ్రీనివాస్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఉత్సవానికి స్థలం చదును

మంథని, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోచమ్మవాడలో ఆడబిడ్డలు సద్దుల బతుకమ్మ ఆడుకోవడానికి స్థలాన్ని ఎక్స్‌కావేటర్‌తో సీనియర్ బీఆర్‌ఎస్ నేత పల్లి సత్తయ్య మంగళ వారం చదును చేయించారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆదేశాల మేరకు చెట్లను, పిచ్చి మొక్కలను తొలగించినట్లు, స్థలాన్ని బతుకమ్మ ఆడుకునే విధంగా చదును చేయించినట్లు సత్తయ్య తెలిపారు.

లేబర్ స్కీంలను ప్రైవేట్ సంస్థలకు ఇవ్వవద్దు

మంథని, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): లేబర్ స్కీంలను ప్రైవేట్ సంస్థలకు ఇవ్వవద్దని సీఐటీయూ ఆధ్వర్యంలో సహాయ కార్మిక శాఖ అధికారికి వినతిపత్రాన్ని సమర్పించినట్లు జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేష్ తెలిపారు. సీఐటీయూ పోరాటాల ఫలితంగా తెలంగాణ భవన, నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు కార్మికుల ప్రమాద మరణానికి రూ. 10 లక్షలు, సహజ మరణానికి రూ.2 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకుందన్నారు. ఈ స్కీంలను ప్రైవేట్ ఇన్సూరెన్స్‌కు ఇవ్వాలని జీవో నంబరు 12 తీసుకువచ్చి 346 కోట్లు అక్రమంగా వాటికి కట్టబెట్టాలని చూస్తున్నట్లు ఆరోపించారు. బాబు రవి, మంథని కిష్టయ్య, నఫీజ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

పాలకుర్తి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని ఈసాలతక్కళ్లపల్లి గ్రామంలో బాధిత కుటుంబాల సభ్యులను మంగళవారం బీఆర్‌ఎస్ రాష్ట్రనాయకుడు, వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వ్యాళ్ల హరీష్ రెడ్డి పరామర్శించారు. వారికి మనోధైర్యం కలిపించారు. గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు తీగెల కొమురయ్య భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. అమరగాని రాజయ్య ఆర్థిక ఇబ్బందులతో ఇటీవలనే ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో ఆయా కుటుంబాలను పరామర్శించారు. బీఆర్‌ఎస్, వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ పక్షాన అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

విత్తనాలు, పురుగు మందులపై అవగాహన

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): విత్తన ఎంపిక, పురుగు మందుల వినియోగంపై అవగాహన కోసం మల్యాల గ్రామపరిధిలోని మోడల్ స్కూల్ విద్యార్థులు మండల కేంద్రంలోని కోరమండల్ రైతు సేవా కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. మోడల్ స్కూల్‌లోని ఉపాధ్యాయులు సింధూజ, ఒకేషనల్ ఎడ్యుకేషన్ అగ్రికల్చరల్ ఆదర్శ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ పోచయ్య, వైస్‌ప్రిన్సిపాల్ రమేష్, కోరమండల్ మన గ్రోమోర్ అగ్రో సెంటర్ నిర్వాహకులు ఆకుల కిరణ్, తిప్పారపు సాగర్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



హర్షవర్ధన్

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌లో ఈనెల 25వ తేదీ నుంచి 28వ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు గోదావరిఖనిలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న హర్షవర్ధన్ పాల్గొననున్నాడు. ఇటీవల జిల్లా కబడ్డీ అసోసియేషన్ నిర్వహించిన ఎంపిక పోటీల్లో హర్షవర్ధన్ ఎంపికయ్యాడు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికవడంపై ప్రధానోపాధ్యాయుడు జింక మల్లేశం, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మణ్, సీనియర్ ఉపాధ్యాయులు రమాదేవి, శాస్త్రి, అరుంధతి, మనోహర్, సంపత్‌రావు అభినందించారు.

అభివృద్ధి కోరామే తప్ప.. ఎమ్మెల్యేను విమర్శించలేదు

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు23 (ఆంధ్రజ్యోతి): తాము పనులు పూర్తి చేయాలనే అంటున్నాము తప్పితే ఎమ్మెల్యేను విమర్శించడం లేదని పలువురు బీఆర్‌ఎస్ నాయకులు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమాశంలో మాట్లాడుతూ పోచంపల్లి, మల్యాల మధ్య నక్కల వాగుపై బ్రిడ్జిని నిర్మించాలని రైతులతో కలిసి ప్రభుత్వాన్ని కోరినట్లు పేర్కొన్నారు. ఎక్కడా కూడా ఎమ్మెల్యేను విమర్శించి మాట్లాడలేదని, కాంగ్రెస్ నాయకులు తమపై బురదజల్లుడు రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎన్నో కోట్ల నిధులు తెచ్చిందనే దానిమీద చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. మాజీ జడ్పీటీసీ వంగళ తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ నూనెటి సంపత్, నాయకులు రవి, ఆడేపు రాజు, బండ రవీందర్ రెడ్డి, ఇబ్రహీం, నూనెటి కుమార్ యాదవ్, సదానందం, రమేష్, సతీష్, కరుణాకర్ రావు పాల్గొన్నారు.

మున్సిపల్ మార్కెట్‌లో స్వచ్ఛత హీ సేవా

కోల్‌సిటీ, సెప్టెంబరు 23(ఆన్‌లైన్): రామగుండం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛతహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. అధికారులు, సిబ్బంది శ్రమదానం చేసి ఆవరణను శుభ్రం చేశారు. మార్కెట్‌లో వ్యాపారులకు స్వచ్ఛతపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. వార్డు ఆఫీసర్ మహేష్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ మధుకర్, శానిటరీ జవాన్లు శ్రీనివాస్‌రెడ్డి, దయానంద్, మెప్మా ఆర్‌పీ సుజాత పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామంలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా హెల్త్ సెంటర్‌లో మంగళవారం వైద్యుడు దేవేందర్ స్వశక్తి సంఘాల మహిళలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. గంట వెంకట రమణరెడ్డి, సిబ్బంది బండి శ్రీధర్, తార, ఆశా వర్కర్స్, మహిళలు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల్లో బతుకమ్మ సంబరాలు



ట్రినిటి, వాసవి డిగ్రీ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ట్రినిటి డిగ్రీ, పీజీ కళాశాలలో మంగళవారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ సీతారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీరామచందర్ ప్రారంభించారు. విద్యార్థినులకు బతుకమ్మ పండుగ సంస్కృతి, ప్రాముఖ్యతను వివరించారు. బతుకమ్మ పాటలు పాడుతూ, అందంగా అలంకరించిన బతుకమ్మలతో విద్యార్థినులు నృత్యాలు చేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి బతుకమ్మ పండుగ సంస్కృతికి ప్రతీకగా నిలిచిందన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వాసవి డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మను తయారు చేశారు. ప్రిన్సిపాల్ జక్కుల కుమార్ బతుకమ్మ గొప్పతనం, సంస్కృతి, సంప్రదాయాల ఆవశ్యకతను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ మేర్గు కోమల, అధ్యాపకులు అరవింద్, శ్రీనివాస్, మానస, శిరీష, వరలక్ష్మి, మేఘన, సతీష్, రాజు, కిరణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోల్‌సిటీటౌన్, (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి పాటలు పాడుతూ ఆటలు ఆడారు. మాజీ ఫ్లోర్‌లీడర్ మహంకాళిస్వామి హాజరై మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపట్టే పండుగల్లో బతుకమ్మ వేడుకలు అని, యువత మన సంస్కృతి సంప్రదాయాలను ముందుకు తీసుకువెళ్లాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మనోహర్, అధ్యాపకులు డాక్టర్ రవి, శ్యాంకుమార్, డాక్టర్ సుధా, డాక్టర్ అంబిక, అనిల్, రమ్య, రవీందర్, రఘుపతి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వై.ప్రసాద్, ఎంబీఏ, ఎంసీఏ విద్యార్థులు పాల్గొన్నారు.



ఖని పీజీ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థులు

పూర్తయిన రిజర్వేషన్ల ప్రక్రియ

(5వ పేజీ తరువాయి)

కాల్వశ్రీరాంపూర్, పెద్దపల్లి, సుల్తానాబాద్, రామగిరి, అంతర్గాం, ఎలిగేడు మండలాలు కేటాయించారని తెలుస్తున్నది. జనరల్‌కు మంథని, ఓదెల, కమాన్ పూర్, ముత్తారం మండలాలు కేటాయించారని సమాచారం. అలాగే ఎంపీపీ స్థానాల్లో 4 స్థానాలు ఎస్సీలకు, 5 స్థానాలు బీసీలకు, 4 స్థానాలకు జనరల్‌కు, ఇందులో మహిళలకు 5 స్థానాలు కేటాయించారని సమాచారం. ఎస్సీలకు ఎలిగేడు, జూలపల్లి, ధర్మారం, పాలకుర్తి మండలాలు, బీసీలకు మంథని, అంతర్గాం, సుల్తానాబాద్, రామగిరి, కాల్వశ్రీరాంపూర్, జనరల్‌కు పెద్దపల్లి, కమాన్‌పూర్, ముత్తారం, ఓదెల మండలాలను కేటాయించినట్లు ప్రచారం జరుగుతున్నది. 2019లో జరిగిన ఎన్నికల ప్రకారం జడ్పీటీసీ స్థానాల్లో ఎస్సీలకు 3 స్థానాలు కేటాయించారు. ఇందులో అంతర్గాం, ఎలిగేడు, మంథని స్థానాలు దక్కాయి. బీసీలకు 3 స్థానాల్లో ఓదెల, కమాన్‌పూర్, ముత్తారం మండలాలకు కేటాయించారు. జనరల్‌కు 7 స్థానాల్లో కాల్వశ్రీరాంపూర్, రామగిరి, జూలపల్లి, పెద్దపల్లి, పాలకుర్తి, ధర్మారం, సుల్తానాబాద్ మండలాలకు కేటాయించారు. ఎంపీపీ స్థానాల్లో ఎస్సీలకు మంథని, అంతర్గాం మండలాలు, బీసీలకు ముత్తారం, కమాన్‌పూర్, పెద్దపల్లి, రామగిరి, ఓదెల మండలాలు, జనరల్‌కు సుల్తానాబాద్, ధర్మారం, జూలపల్లి, పాలకుర్తి, జూలపల్లి మండలాలు కేటాయించారు.

● **బీసీలకు 110 సర్పంచ్ స్థానాలు..**

జిల్లాలో 263 గ్రామ పంచాయతీలు ఉండగా, ఇందులో ఎస్సీలకు 50 స్థానాలు, ఎస్టీలకు 5 స్థానాలు, బీసీలకు 110 స్థానాలు, జనరల్‌కు 98 స్థానాలను రిజర్వు చేసినట్లు సమాచారం. ఎంపీటీసీ స్థానాలు 137 ఉండగా, ఎస్సీలకు 26 స్థానాలు, ఎస్టీలకు 3 స్థానాలు, బీసీలకు 58 స్థానాలు, జనరల్‌కు 50 స్థానాలు కేటాయించారని తెలుస్తున్నది. అటు, ఇటుగా ఈ సంఖ్య మారే అవకాశాలు ఉన్నాయి.

కూరగాయల మార్కెట్‌లో హమాలీల రేట్లు పెంచాలి

మార్కండేయకాలనీ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని కూరగాయల మార్కెట్‌లో పని చేస్తున్న హమాలీ కార్మికులకు కూలి రేట్లు పెంచాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో హోల్‌సేల్ షాపుల వద్ద మంగళవారం హమాలీలు ఆందోళనకు దిగారు. అధ్యక్షుడు ఎంఏగౌస్ మాట్లాడుతూ ఆరేళ్ళుగా హమాలీ కార్మికులకు రేట్లు పెంచలేదని, హోల్ సేల్ వ్యాపారులకు, లేబర్ అధికారులకు ఎన్నోసార్లు వినతి పత్రాలు ఇచ్చినా వ్యాపారులు పెంచుకోవడం లేదని ఆరోపించారు. హమాలీలు పని చేయడం వల్లే హోల్‌సేల్ వ్యాపారులకు లక్షలాది రూపాయలు లాభాలు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. రేట్లు పెంచాలని పోరాటాలు చేస్తున్నా వ్యాపారులు పట్టించుకోవడం లేదని, పైగా వారిని మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కూలీ రేట్లు పెంచాలని యూనియన్ గౌరవ అధ్యక్షుడు మడ్డి ఎల్లాగౌడ్ సమక్షంలో హోల్ సేల్ వ్యాపారులు చర్చలు జరిపి పరిష్కారం చేసుకుంటామని చెప్పి వారం రోజులు గడిచినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. అనంతరం హోల్ సేల్ వ్యాపారులకు వినతిపత్రం సమర్పించారు. వ్యాపారులు త్వరగా నిర్ణయం తీసుకోవాలని, లేకపోతే సమ్మెకు పిలుపునిస్తామని ఆయన హెచ్చరించారు. నాయకులు కండె లక్ష్మయ్య, గాలిపెల్లి సతీష్, రాంచందర్, జానీమియ, బండారి రవి, జే శ్రీనివాస్, ఐలయ్య పాల్గొన్నారు.

జగదీశ్వర్‌కు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు రామగుండం జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాల, ఎన్‌టీపీసీ అన్నపూర్ణ కాలనీలోని దుర్గయ్యపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గడ్డం జగదీశ్వర్ ఎంపికయ్యారు. ఈ అవార్డును శారదా ఎడ్యుకేషనల్ సొసైటీ హైదరాబాద్ అందజేస్తోంది. ఈనెల 25న హైదరాబాద్‌లోని బిర్లా ప్లానిటోరియం భాస్కరా ఆడిటోరియంలో జరిగే అవార్డుల ప్రదానోత్సవంలో అవార్డును జగదీశ్వర్ అందుకోనున్నారు.

అకాల వర్షం

పాలకుర్తి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షం కురిసింది. దీంతో బతుకమ్మ ఆటకు అంతరాయం ఏర్పడింది. గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అధికారులు, సిబ్బంది ప్రజలకు విద్యుత్ సరఫరా అందించేందుకు ప్రయత్నాలు చేసే పనిలో నిమగ్న మయ్యారు.

ఓబీసీ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడిగా తిరుపతి



కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఓబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా గోదావరిఖనికి చెందిన పెంచాల తిరుపతిని నియమిస్తూ మంగళవారం బీసీ, ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు నియామక ఉత్తర్వు లను అందజేశారు. తిరుపతి మాట్లాడుతూ సింగరేణిలో బీసీ, ఓబీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తానని చెప్పారు.

చెట్ల కొమ్మలు తొలగించాలి

పెద్దపల్లి రూరల్ , సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చీకురాయిలో ప్రధాన రహదారి వెంట విద్యుత్ వైర్లకు ఆనుకొని ఉన్న చెట్ల కొమ్మలు తొలగించాలని మంగళవారం పంచాయతీ కార్యదర్శి శంకరయ్యకు గ్రామస్తులు విన్నవించారు. విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, వర్షం, గాలులతో విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు తగిలి ఎలక్ట్రానిక్ పరికరాలు కాలిపోతున్నాయని పేర్కొన్నారు.

గుండేటి రాజేష్‌కు ఉత్తమ సేవా అవార్డు



అమలనాగార్జున చేతుల మీదుగా అవార్డు అందుకున్న రాజేష్

ఫైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని ఫిల్మ్‌నగర్‌లో జరిగిన బ్లూక్రాస్ 33వ వార్షికోత్సవ వేడుకల్లో ఫైటింక్లయిన్‌కాలనీకి చెందిన జిల్లా బ్లూక్రాస్ ఇన్‌చార్జీ గుండేటి రాజేష్ ఉత్తమ సేవా అవార్డు పురస్కారాన్ని అందుకున్నారు. బ్లూ క్రాస్ చైర్మన్ అక్కినేని అమలనాగార్జున్ చేతుల మీదుగా రాజేష్‌కు అవార్డు, మెడల్స్, అభినందన పత్రాన్ని అందజేసి సత్కరించారు. రాజేష్‌ను పలువురు అభినందించారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం

ఓదెల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీఎస్‌టీ తగ్గింపు నిర్ణయాన్ని హర్షిస్తూ మంగళవారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు శనిగరపు రమేష్ మాట్లాడుతూ జీఎస్‌టీ తగ్గింపుతో పేద కుటుంబాలకు మేలు జరుగుతుందని తెలిపారు. అనేక ఔషధాల ధరలు తగ్గుతాయన్నారు. పుల్లూరి పృథ్వీరాజ్, మాజీ ఎంపీపీ రేణుకాదేవి, తీర్థాల కుమారస్వామి, సత్యనారాయణ, అశోక్, రాజేంద్ర ప్రసాద్, మేరుగు సారంగం పాల్గొన్నారు. జీలకుంటలో ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎరవెల్లి అనిల్‌రావు, భాస్కర్‌రెడ్డి అగ్గి శ్రీనివాస్, రాజు, నవీన్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలి

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారంను బాలింతలు, గర్భిణీలు, చిన్నారులు తప్పనిసరిగా తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రేమలత అన్నారు. మంగళవారం హన్మంతునిపేట, పెద్దపల్లి - 2 అంగన్‌వాడి కేంద్రాల్లో పోషణమాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రేమలత హజరై తల్లులకు, చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు రేఖ, అన్నపూర్ణ, శ్రీదేవి, రేణుకతో పాటు పలువురు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నవరాత్రోత్సవాలు



స్వతంత్ర చౌక్ మండపంలో అమ్మవారు

మార్కండేయకాలనీ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో దుర్గాదేవి శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. వాడ వాడన ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాలు, ఆలయాల్లో మంగళవారం గాయత్రి దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పలు మండపాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించగా ఉజ్జయిని మహంకాళి యూత్ ఆధ్వర్యంలో మాలధారణ భక్తులకు అన్నదానం నిర్వహించారు. పవర్‌హౌస్‌కాలనీ దుర్గామాత ఆలయం, జవహర్‌నగర్‌లోని జయదుర్గాదేవి ఆలయంలో పెద్ద ఎత్తున భక్తులు పూజలు నిర్వహించారు.

మాజీ మంత్రి దంపతుల పూజలు

కోల్‌సిటీటౌన్, (ఆంధ్రజ్యోతి): దుర్గాదేవి శరన్నవరాత్రులలో భాగంగా గోదావరిఖని జవహర్‌లాల్‌నగర్‌లోని జయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్-స్నేహలత దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుల వేదమంత్రోచ్చరణల మధ్య మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ దంపతులు పూజలు చేశారు. అమ్మవారు రెండో రోజు గాయత్రిదేవి అలంకరణలో దర్శనమివ్వగా భక్తులు దర్శించుకున్నారు.

జేఎన్టీయూలో బ్లాక్ స్థాయి పోటీలు ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్స్‌పాల్

రామగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం బ్లాక్ స్థాయి వివిధ రకాల పోటీలను కళాశాల ప్రిన్స్‌పాల్ విష్ణువర్ధన్ ప్రారంభించారు. భారత మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ మై భారత్ జిల్లా రామగిరి ఫ్రేండ్స్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలను ప్రిన్సిపాల్ ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులతో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పోటీల్లో వాలీబాల్, కబడ్డీ, షటిల్, బాడ్మింటన్, చెస్ పోటీలు జరుగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ ఉదయ్‌కుమార్, మైభారత్ పెద్దపల్లి ఇన్‌చార్జి మహేష్, ఫిజికల్ డైరెక్టర్లు పింగిళి కృష్ణారెడ్డి, సునీల్‌కుమార్, క్రీడకారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఈజీఎస్ గ్రామసభలు

పెద్దపల్లి రూరల్ , సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మార్చి 2024 నుంచి 2025 వరకు ఈజీఎస్ ద్వారా చేపట్టిన పనుల ఆడిట్‌పై మంగళవారం గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. మండలంలోని మొదటి విడతగా రాఘవపూర్, కాసులపల్లి, పెద్దబొంకూర్, మూలసాల, అందుగులపల్లి, రాగినేడు, భోజన్నపేట, అప్పన్నపేట, గౌరెడ్డిపేట, కుర్మపల్లి, చీకురాయి, మారేడుగొండ, పాలితం, కొత్తపల్లి నిర్వహించారు. ఈ సందర్భంగా మూలసాల గ్రామంలో ఏపీవో రమేష్ బాబు పాల్గొన్నారు.

కల్వచర్లలో అధ్వానంగా రహదారులు

రామగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామపంచాయతీ పరిధిలోని కుర్మపల్లిలోని అంతర్గత రోడ్డు అధ్వానంగా మారడంతో మంగళవారం ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. మారుమూల ప్రాంతాల్లో సైతం ఇంత అధ్వానంగా రోడ్డు లేవని వాపోయారు. బురదగా మారిన రోడ్డు పై నడవటం బాధగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు తక్షణం మట్టి, లేదా కంకర వేయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో గ్రామపంచాయతీ ఎదుట ఆందోళన చేస్తామని మహిళలు హెచ్చరించారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే చందర్ జన్మదినం

గోదావరిఖని, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ జన్మదినాన్ని మంగళవారం బీఆర్‌ఎస్ శ్రేణులు నిర్వహించారు. అన్నదానం, ఆర్థికసాయం, చీరలు పంపిణీ చేశారు. బొడ్డుపల్లి శ్రీనివాస్ కుమ్మరి శ్రీనివాస్, శారద, భాస్కర్, శ్రీనివాస్, కౌటంబాబు, ముద్దసాని సంధ్యారెడ్డి, కోరుకంటి మణి దీప్, నారాయణ దాస్ మారుతి, సాయికుమార్, గాదం విజయ, కృష్ణవేణి పాల్గొన్నారు. షిర్కే చౌరస్తాలో కేక్ కట్ చేశారు.

వాస్తవ లాభాల్లో కార్మికులను మోసం చేసిన ప్రభుత్వం



ఆర్‌జీ-2లో కార్మికులకు నల్లబ్యాడ్జీలు పెడుతున్న టీబీజీకేఎస్ నాయకులు

ఫైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వాస్తవ లాభాల్లో సింగరేణి కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని టీబీజీకేఎస్ ఆర్‌జీ-2 ఉపాధ్యక్షుడు అయిలి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆర్‌జీ-2 ఏరియాలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. టీబీజీకేఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రాంమూర్తి హాజరై మాట్లాడారు. వాస్తవ లాభాలు రూ.6394 కోట్లకు 2360 కోట్లు మాత్రమే ప్రకటించి రూ.4034 కోట్లను పక్కకు పెట్టడం కార్మిక వర్గాన్ని ఆర్థిక దోపిడికి గురి చేయడమేనన్నారు. రూ. 5లక్షల లాభాల వాటా రావాల్సిన కార్మికుడికి రూ. లక్షా95వేలకే పరిమితం చేయడం కార్మికవర్గాన్ని ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఇప్పటికైనా సింగరేణి కార్మిక సంఘాలు కార్మికవర్గానికి జరుగుతున్న నష్టంపై కలిసికట్టుగా పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. టీబీజీకేఎస్ నాయకులు చెరుకు ప్రభాకర్‌రెడ్డి, సత్యం, బేతి చంద్రయ్య, చల్లా రవీందర్‌రెడ్డి, మామిడి తిరుపతి, దాసం సురేందర్, ముసుకుల అనిల్‌రెడ్డి, హరిప్రసాద్, బొడ్డు రమేష్, పాల్గొన్నారు.

ఇఫ్టూ ఆధ్వర్యంలో...

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన లాభాల్లో సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు అన్యాయం జరిగిందని ఆర్జీ-2 వివిధ సెక్షన్లలో కాంట్రాక్ట్ కార్మికులు ఇఫ్టూ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపారు. సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి అశోక్ మాట్లాడారు. సింగరేణి లాభాల్లో కాంట్రాక్టు కార్మికుల శ్రమ ఉందని, పర్మనెంట్ కార్మికులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల వాటా పెంచడానికి ప్రయత్నం చేయలేదని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం సింగరేణి యాజమాన్యం కాంట్రాక్ట్ కార్మికులకు రూ. 10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గట్టయ్య, సుగుణ, రాయమల్లు, పోచం, శంకరమ్మ, విజయలక్ష్మి, లింగయ్య, అక్కపాక రాయమల్లు, నాగరాజు, లక్ష్మి, నరేష్‌పాల్గొన్నారు .

లాభాల వాటాపై శ్వేతపత్రం విడుదల చేయాలి

గోదావరిఖని, (ఆంధ్రజ్యోతి): సింగరేణి లాభాల వాటాపై శ్వేత పత్రం విడుదల చేయాలని బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల లాభాల వాటలో రాష్ట్ర ప్రభుత్వం కుట్రకు తలొగ్గిన గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు కార్మికులకు అన్యాయం చేశారని, అంకెల గారడీతో వాస్తవ లాభాలను ప్రకటించకుండా కార్మికుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా చేశాయన్నారు. వాస్తవ లాభాల నుంచి 34శాతం వాటాను కార్మికులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

సద్దుల బతుకమ్మ ఏర్పాట్ల పరిశీలన

రామగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపీఏ డివిజన్ పరిధిలోని రాణిరుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో నిర్వహించే సద్దుల బతుకమ్మ వేడుకల ఏర్పాట్లను ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అధికారుల బృందం పరిశీలించారు. బతుకమ్మ వేడుకలకు అన్ని ఏర్పాట్లను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బతుకమ్మ వేడుకల సందర్భంగా ఉత్తమ బతుకమ్మలను ఎంపిక చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయతోపాటు పది ప్రోత్సాహక బహుమతులను అందజేయాలని సూచించారు. అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



క్రీడా ప్రాంగణంలో జీఎం, అధికారులు



ఏఐటీయూసీ ఆందోళనతోనే లాభాల వాటా ప్రకటన

గోదావరిఖని, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సింగరేణి వ్యాప్తంగా గుర్తింపు సంఘం ఏఐటీయూసీ చేసిన ఆందోళనల వల్లనే రాష్ట్ర ప్రభుత్వం లాభాల్లో వాటా ప్రకటన చేశారని, ప్రకటన విషయంలో యాజమాన్యం గుర్తింపు సంఘం తో చర్చించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకొందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. యాజమాన్యం గత ఆర్థిక సంవత్సరంలో వచ్చిన లాభాలను చెప్పకుండా నిర్లక్ష్యం చేయడం వల్లనే ఏఐటీయూసీ ఈనెల 19న జీఎం కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించామన్నారు. యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది 34శాతం వాటా ప్రకటన చేశారని ఆయన పేర్కొన్నారు. యాజమాన్యం సంస్థకు వచ్చిన లాభాలను గుర్తింపు సంఘంతో చర్చించకుండా ప్రకటన చేయించడాన్ని సోమవారం సింగరేణి భవన్‌లో జరిగిన సమావేశంలో వ్యతిరేకించామని పేర్కొన్నారు. ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు మడ్డి ఎల్లాగౌడ్, వైవీ రావు, కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కందుకూరి రాజారత్నం, నాయకులు జీగురు రవిందర్, గౌతం గోవర్ధన్, దాసరి శ్రీనివాస్, పెద్దెల్లి శంకర్, సంతోష్, అటికేటి రాజు, సమ్మి రెడ్డి, శంకర్ రావు, ఆకుల సురేష్, కీర్తి శేఖర్, రాజేందర్, తిరుపతి, వెంకటేష్, రాజయ్య, శ్రీకాంత్, పడాల కనకరాజు, గంగారపు చంద్రయ్య, ఆర్ రాజేశ్వరరావు, జే దేవయ్య, తాని రాజబాబు, కలవల జగన్నాథం పాల్గొన్నారు.